# సాక్షి తూర్పుగోదావరి

శుక్రవారం | 25 | ఏప్రిల్ | 2025






## పుణ్యస్నానానికి వెళ్లి.. తిరిగి రాని లోకాలకు

ఏలేరు కాలువలో పుణ్యస్నానానికి దిగి, అమ్మమ్మ, మనవడు మృతి చెందిన ఘటన యర్రవరంలో చోటు చేసుకుంది.


8లో



## రూ.లక్ష విరాళం

మామిడికుదురు: అప్పనపల్లి బాల బాలాజీ స్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు అదే గ్రామానికి చెందిన పోచిరాజు రామ్మోహనరావు, రాజరాజేశ్వరి దంపతులు గురువారం రూ.1,00,011 విరాళం అందించారు.

## 4,500 క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు గురువారం 4,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 600, మధ్య డెల్టాకు 900, పశ్చిమ డెల్టాకు 3 వేల క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.05 అడుగులకు చేరింది.

## న్యూస్‌రీల్

### ఇన్నోవేషన్ హబ్‌కు రెండెకరాలు



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ ప్రశాంతి తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జిల్లా కేంద్రం రాజమహేంద్రవరంలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటుకు త్వరలో రెండెకరాల స్థలాన్ని గుర్తించనున్నామని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె ఈ అంశంపై మాట్లాడారు. ఈ హబ్ ఫలవంతమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని, కార్యాచరణ లక్ష్యంగా గుర్తించిన వ్యక్తులకు పరిజ్ఞానాన్ని అందించే క్రమంలో, నూతన ఆవిష్కరణలు చేపట్టాలని అన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు, గ్రీన్ కోర్, ఓఎన్‌జీసీ, గెయిల్, ఇతర ఇన్నోవేటివ్ ఏజెన్సీలు, ఎస్ఐటీఏ, జేఎన్‌టీయూ నిపుణులు, పారిశ్రామిక ప్రోత్సాహక కమిటీ, ఇతర సమన్వయ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### జాతీయ పోటీలకు ఎంపిక

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఏలూరులో ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకూ జరిగిన విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర స్థాయి పోటీల్లో కాకినాడ క్రీడాకారులు ప్రతిభ చూపి, 3 బంగారు, 2 రజత, 3 కాంస్య పతకాలు అందుకున్నారు. జి.సురేష్ కుమార్ 100, 200 మీటర్లు, కె.సత్యదుర్గ బోసే గేమ్, కె.ప్రేమ్‌కుమార్ 200, 100 మీటర్లు రన్నింగ్‌లో ప్రతిభ చూపి, ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విజేతలను ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ జిల్లా కో ఆర్డినేటర్ చామంతి నాగేశ్వరరావు, సమగ్ర శిక్ష కార్యాలయ సిబ్బంది గురువారం అభినందించారు.

# ధరాధన్!



పరిశ్రమకు గెలల రవాణా

- మెట్ట రైతులను ఆదుకొంటున్న ఆయిల్‌పామ్
- టన్ను గెలల ధర రూ.20,900
- 35 వేల ఎకరాల్లో సాగు
- ఎకరాకు రూ.2 లక్షల రాబడి

| జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం (ఎకరాలు) | |
|---|---|
| దేవరపల్లి | 7,500 |
| గోపాలపురం | 3,000 |
| నల్లజర్ల | 21,000 |
| రంగంపేట | 1,960 |
| రాజానగరం | 225 |
| కొవ్వూరు నియోజకవర్గం | 3,200 |
| నిడదవోలు నియోజకవర్గం | 1,132 |

దేవరపల్లి: ఇతర పంటలతో పోలిస్తే లాభసాటిగా ఉండటంతో జిల్లాలోని మెట్ట ప్రాంతంలో ప్రధాన వాణిజ్య పంటగా ఉన్న ఆయిల్‌పామ్ సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. దాదాపు మూడు దశాబ్దాలుగా ఇక్కడి రైతులు ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారు. పెట్టుబడి తక్కువ, రాబడి ఎక్కువగా ఉండటంతో పొగాకు, జీడిమామిడి తోటలు తొలగించి, ఆ భూముల్లో ఆయిల్‌పామ్ తోటలు వేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలోని గోపాలపురం, కొవ్వూరు, నిడదవోలు నియోజకవర్గాల్లోని 35,317 ఎకరాల్లో రైతులు ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారు. గత ఏడాది కేంద్ర ప్రభుత్వం తీసుకున్న విధానపరమైన నిర్ణయంతో మార్కెట్లో వంట నూనెల ధరలు విపరీతంగా పెరిగాయి. ఈ నేపథ్యంలో ఆయిల్‌పామ్ గెలల ధరలు కూడా పెరిగాయి. ప్రస్తుతం టన్నుకు రూ.20,900 ధర పలుకుతోంది. ఈ ప్రాంతంలో పండిస్తున్న పంటను ఎప్పటికప్పుడు రెండు ఫ్యాక్టరీలు ప్రతి మండలంలో గెలల సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేసి, రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నాయి. అనంతరం, 15 రోజుల్లో వారి ఖాతాలకు సొమ్ము జమ చేస్తున్నాయి. ఆయిల్ రికవరీని బట్టి గెలలకు ధర నిర్ణయిస్తారు. రవాణా చార్జీలు, ఇతర ఖర్చులకు ప్రభుత్వం అదనంగా టన్నుకు రూ.170 చెల్లిస్తుంది. మూడు నెలలుగా గెలల ధర నిలకడగా ఉంటోంది. ప్రస్తుతం గిట్టుబాటు ధర లభిస్తుండటంతో రైతులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



దేవరపల్లిలో ఆయిల్‌పామ్ తోట



గెలలతో ఉన్న ఆయిల్‌పామ్ చెట్టు

**పొగాకుకు ప్రత్యామ్నాయంగా..**

అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ తగ్గడంతో 2020 నుంచి మూడేళ్ల పాటు పొగాకుకు గిట్టుబాటు ధర లభించలేదు. దీంతో, ప్రత్యామ్నాయంగా రైతులు ఆయిల్‌పామ్ సాగు వైపు మొగ్గు చూపారు. దాదాపు 10 వేల ఎకరాల్లో ఈవిధంగా మొక్క తోటలు వేసినట్టు సమాచారం. అయితే, రెండేళ్లుగా పొగాకుకు అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి ధర వస్తుండటంతో పలువురు రైతులు ఆయిల్‌పామ్ ముదర తోటలు తొలగించి, పొగాకు సాగు వైపు మళ్లారు. అయినప్పటికీ, లాభాలు గ్యారంటీగా వచ్చే ఆయిల్‌పామ్ తోటలు వేసేందుకు అవసరమైన మొక్కల కోసం రైతులు ఎదురు చూస్తుండటం విశేషం. మొక్క తోటలు ఐదేళ్ల తర్వాత గెలలు వేయడం మొదలు పెడతాయి. యాజమాన్య పద్ధతులు, నీటి సదుపాయం ఉన్న భూముల్లో మొక్క తోటల నుంచి ఏడాదికి ఎకరాకు 10 టన్నుల వరకూ గెలల దిగుబడి వస్తుంది. నేల స్వభావాన్ని బట్టి ఎకరాకు 15 టన్నుల దిగుబడులు సాధిస్తున్న రైతులు కూడా ఉన్నారు. మెట్ట ప్రాంతంలో ఒక్కో రైతు 10 నుంచి 30 ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారు.

**ఎకరాకు రూ.2 లక్షల ఆదాయం**

ఆయిల్‌పామ్ పంట సెప్టెంబర్ వరకూ ఉంటుంది. మే నెల నుంచి ఆగస్టు మధ్య 80 శాతం గెలలు దిగుబడి వస్తుంది. అక్టోబర్ నుంచి ఏప్రిల్ వరకూ 20 శాతం గెలలు మాత్రమే వస్తాయి. దిగుబడి తగ్గడంతో ఆ సమయంలోనే మార్కెట్లో ధర పెరుగుతుంది. వర్షాకాలం నాలుగు నెలలూ దిగుబడి బాగున్నప్పటికీ గిట్టుబాటు ధర దక్కడం లేదని రైతులు చెబుతున్నారు. అయితే, ఇతర పంటలతో పోలిస్తే ఆయిల్‌పామ్‌కు మంచి ధర వస్తుందని, ఏడాదికి ఎకరాకు సుమారు రూ.2 లక్షల ఆదాయం వస్తుందని తెలిపారు.

### ధర బాగుంది



ప్రస్తుతం ఆయిల్‌పామ్ గెలల ధర బాగుంది. ఇతర పంటలకు గిట్టుబాటు ధర రాకపోయినా ఆయిల్‌పామ్ ఆ నష్టాన్ని భర్తీ చేస్తోంది. టన్ను గెలల సగటు ధర రూ.16 వేలు ఉంటే ఏడాదికి ఎకరాకు రూ.1.60 లక్షలు, రూ.20 వేలు పలికితే రూ.2 లక్షల వరకూ రాబడి వస్తోంది. ఖర్చులు పోనూ ఎకరాకు సుమారు రూ.లక్ష మిగులుతుంది. పెట్టుబడి ఎకరాకు రూ.40 వేల నుంచి రూ.50 వేలు అవుతుంది. వర్షాకాలంలో దిగుబడులు పెరుగుతాయి. జూన్ నెలలో గెలల ధర మరింత పెరిగే అవకాశం ఉంది.

– నరహరిశెట్టి రాజేంద్రబాబు, డైరెక్టర్, రాష్ట్ర ఆయిల్‌పామ్ బోర్డు, యర్నగూడెం, దేవరపల్లి మండలం

### లాభాల పంట



ఆయిల్‌పామ్ లాభాల పంట. రెండేళ్ల నుంచి మంచి ఆదాయం వస్తోంది. డ్రిప్ ద్వారా నీటి తడులు పెట్టడం, పశువుల ఎరువు వాడటం వల్ల దిగుబడులు పెరిగాయి. ఐదెకరాల్లో ఆయిల్‌పామ్ పంట సాగు చేస్తున్నాను. ఎకరాకు సగటున 9 టన్నుల దిగుబడి వస్తోంది. ప్రస్తుతం ధర ఆశాజనకంగా ఉంది. సెప్టెంబర్ వరకూ ఈ ధర ఉంటే మంచి ఆదాయం వస్తుంది. శ్రమ, పెట్టుబడి తక్కువ, ఆదాయం ఎక్కువ. మార్కెట్లో ధర మరింత పెరిగే అవకాశం ఉంది.

– సత్తి జగదీశ్వరరెడ్డి, రైతు, కృష్ణంపాలెం, దేవరపల్లి మండలం

| 2019 నుంచి ఆయిల్‌పామ్ ధరలు (టన్నుకు రూ.లు) | |
|---|---|
| 2019 | 6,000 |
| 2020 | 8,000 |
| 2021 | 10,000 |
| 2022 | 23,639 |
| 2023 | 14,500 |
| 2024 | 16,400 |
| 2025 | 20,900 |

| ఐదు నెలలుగా ధరల పెరుగుదల (టన్నుకు రూ.లు) | |
|---|---|
| నవంబర్ | 14,300 |
| డిసెంబర్ | 16,400 |
| జనవరి | 18,000 |
| ఫిబ్రవరి | 20,000 |
| మార్చి | 20,900 |

ఐదు నెలల కాలంలో సుమారు టన్నుకు రూ. 6,600 పెరిగింది.

### ఈ ధర నిలబడాలి



ఆయిల్‌పామ్ గెలలకు జనవరి నుంచి గిట్టుబాటు ధర వస్తోంది. టన్ను గెలల ధర గత నెల రూ.20,900 ఉంది. ఏప్రిల్ ధర ఇంకా ప్రకటించాల్సి ఉంది. కొంత మంది రైతులు ఎకరాకు 10 నుంచి 13 టన్నుల దిగుబడి సాధిస్తున్నారు. ఏడాదికి సగటున ఎకరాకు రూ.2.20 లక్షల వరకూ కూడా ఆదాయం వస్తోంది. పెట్టుబడి, ఖర్చులు పోనూ ఎకరాకు రూ.1.80 లక్షల నికర ఆదాయం లభిస్తోంది. పొగాకు పంటకు ధర ఉన్నప్పటికీ పెట్టుబడి ఎక్కువ. ప్రధానంగా కూలీల కొరతను ఎదుర్కొంటున్నాం. ఆయిల్‌పామ్ తోటల్లో కోకో, అరటి వంటివి అంతర పంటలుగా సాగు చేసి కూడా రైతులు అదనపు ఆదాయం పొందుతున్నారు. ఏడాదిలో నాలుగు నెలలు, ముఖ్యంగా వర్షాకాలంలో నాణ్యమైన గెలల దిగుబడి వస్తుంది. ఈ ధర అప్పుడు కూడా ఉంటే మంచి ఆదాయం వస్తుంది.

– యాగంటి వెంకటేశ్వరరావు, రైతు, దేవరపల్లి

## వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

సాక్షి, రాజమహేంద్రవరం: వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాలకు జిల్లా అధ్యక్షులను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామక ప్రక్రియ జరిగింది. రైతు విభాగం జిల్లా అధ్యక్షుడిగా వల్లభనేని సత్యనారాయణ (గోపాలపురం), క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా ఎంఎస్ఎస్ఎన్ విజయ సారథి (రాజమహేంద్రవరం రూరల్), గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడిగా నాగళ్లపాటి శ్రీను (కొవ్వూరు), అంగనవాడీ వింగ్ అధ్యక్షురాలిగా కురుకూరి ధనలక్ష్మి (గోపాలపురం) నియమితులయ్యారు. తమ నియామకానికి సహకరించిన ఆయా నియోజకవర్గాల కో ఆర్డినేటర్లకు, జిల్లా అధ్యక్షులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. తమపై నమ్మకం ఉంచి, బాధ్యతలు అప్పగించిన అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని చెప్పారు.



కురుకూరి ధనలక్ష్మి



ఎంఎస్ఎస్ఎన్ విజయసారథి



వల్లభనేని సత్యనారాయణ



నాగళ్లపాటి శ్రీను

**జిల్లా కమిటీలో పలువురి నియామకం**

రాజమహేంద్రవరం సిటీ: అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీలో పలువురిని వివిధ హోదాల్లో నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. పార్టీ జిల్లా కమిటీ ఉపాధ్యక్షులుగా బొప్పన సుబ్బారావు, అడబాల వెంకటేశ్వరరావు, బొండాల వెంకన్నబాబు, కాకర్ల వెంకటేశ్వరరావు, అడబాల సీతారామకృష్ణ, వీరమళ్ళ సత్యనారాయణ; ప్రధాన కార్యదర్శులుగా పఠాన్ అన్సర్ బాషా, తడాల విష్ణు చక్రవర్తి, జుట్టా కొండలరావు (ఏడుకొండలు), కోర్ల ఉదయ భాస్కర్, కందుల శ్రీనాథ్; ట్రెజరర్‌గా యెజ్జు శ్రీనివాస్ కిరణ్ నియమితులయ్యారు. సెక్రటరీ ఆర్గనైజర్‌గా పెండ్ర పోశేశ్వరరావు, చాంద్ బాషా షేక్, పితాని హరికృష్ణ, ఎనుముల త్యాగరాజు, వాసంశెట్టి మాధవ, పడాల వీర వెంకట సత్యనారాయణరెడ్డి (పీవీ), జాలెం వెంకటేశ్వరరావు, గెడ్డం సూర్యప్రసాద్, పోతిరెడ్డి నాగరాజు, కసులూరి సతీష్, నీలపాల శివరామకృష్ణ, గిరజాల రామ, సూరిశెట్టి కుటుంబరావు, కేతినీడి అశోక్ కుమార్, జ్యోతుల లక్ష్మీనారాయణలను నియమించారు. సెక్రటరీ యాక్టివిటీగా కొల్లాటి ఇజ్రాయిల్, తాడి సూరారెడ్డి, ఎల్లా రామారావు, చోళ్ల శ్రీనివాస్, దుగ్గిరాల రమేష్‌బాబు, ముప్పిడి వెంకటరత్నం, కొప్పినీడి ప్రసాద్‌బాబు, తాడికొండ విష్ణుమూర్తి, ముద్దాల తిరుపతిరావు (అను), వంబోలు పోసిబాబు, మట్టా శ్రీనివాసరావు, కొల్లి రాజా రమాదేవి, టేకుమూడి త్రిమూర్తులు నియమితులయ్యారు. అధికార ప్రతినిధులుగా గనిశెట్టి సోమేశ్వరరావు, పెయ్యల రాజేష్, గాడా జగదీష్, సబ్బెళ్ల కృష్ణారెడ్డి, కుచ్చులపాటి కుమార్, గంధం సీహెచ్ఆర్ శేషసాయి నియమితులయ్యారు.



కొవ్వొత్తులతో ప్రదర్శన చేస్తున్న వైద్య విద్యార్థులు



భారత దేశం ఆకృతిలో వైద్య విద్యార్థుల మానవ హారం

## మనం భారతీయులం.. మనది అఖండ భారతం

జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రవాదుల దురాగతానికి బలైపోయిన పర్యాటకులకు జీఎస్ఎల్ వైద్య కళాశాల ప్రాంగణంలో వైద్య విద్యార్థులు గురువారం రాత్రి శ్రద్ధాంజలి ఘటించారు. కొవ్వొత్తులతో మౌన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం మైదానంలో భారతదేశం ఆకృతిలో మానవహారంగా ఏర్పడి 'మనం భారతీయులం – మనది అఖండ భారతం' అంటూ ఆంగ్ల, తెలుగు, తమిళ, మలయాళ, ఒడియా, కన్నడ, బెంగాలీ భాషల్లో ఉద్వేగభరితంగా నినదించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ వి.గురునాథ్, డాక్టర్ జి.సునీల్, డాక్టర్ అప్పారావు, సూపరింటెండెంట్ డాక్టర్ టీవీఎస్‌పీ మూర్తి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. – రాజానగరం

# గోకులంలో క్షోభ



- ఆర్భాటంగా మినీ గోకులాల నిర్మాణాలు
- జనవరిలో ప్రారంభించిన కూటమి నేతలు
- షెడ్లు నిర్మించుకున్నా బిల్లులు చెల్లించని సర్కారు
- రైతుల గగ్గోలు

పిఠాపురం: పశువుల వసతి కోసమని కూటమి ప్రభుత్వం 'మినీ గోకులాలు' పేరిట షెడ్లు నిర్మించే పథకాన్ని ఆర్భాటంగా ప్రారంభించింది. 'పాడి పరిశ్రమకు పూర్వ వైభవం తీసుకువస్తున్నాం.. పాడి రైతులకు అండగా ఉంటాం.. పాడి–పంట అభివృద్ధికి ప్రత్యేక పథకం ద్వారా కృషి చేస్తున్నాం' అంటూ కూటమి నేతలు ప్రకటించడంతో ఈ షెడ్ల నిర్మాణానికి జిల్లావ్యాప్తంగా పలువురు రైతులు ముందుకొచ్చారు. నిర్మాణం పూర్తయిన అనంతరం ఈ గోకులాలను ఎక్కడికక్కడ మంత్రులు, ఎమ్మెల్యేలు, కూటమి ప్రజాప్రతినిధులు ఈ గోకులాలను అట్టహాసంగా ప్రారంభించారు. ఇదంతా జరిగి నెలలు గడచిపోయాయి. తీరా చూస్తే వీటి నిర్మాణానికి పెట్టిన ఖర్చును ప్రభుత్వం చెల్లించకపోవడంతో జిల్లా వ్యాప్తంగా రైతులు గగ్గోలు పెడుతున్నారు.

**ఏం జరిగిందంటే..**

అన్నదాతకు ఇటు వ్యవసాయ పనుల్లో చేదోడువాదోడుగా ఉంటూ, అదనపు ఆదాయాన్ని కూడా ఇచ్చే పశువుల వసతి కోసమని ప్రభుత్వం మినీ గోకులాల పథకాన్ని ప్రారంభించింది. దీని ద్వారా పశులకు రేకుల షెడ్లు నిర్మించేందుకు రైతులకు ఆర్థిక సహాయం అందిస్తామని గొప్పగా ప్రకటించారు. పాడి పశువుల సంఖ్యను బట్టి గోకులాలు నిర్మించుకునే వెసులుబాటు కల్పించారు. మొత్తం షెడ్డు నిర్మాణ వ్యయంలో రైతు 10 శాతం భరించాలి. మిగిలిన 90 శాతం ప్రభుత్వమే చెల్లించేలా ఈ పథకాన్ని రూపొందించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు జిల్లా వ్యాప్తంగా పాడి రైతులు 1,380 గోకులాలు నిర్మించుకున్నారు. 90 శాతం రాయితీ వస్తుందన్న నమ్మకంతో రైతులు వడ్డీకి అప్పులు తెచ్చి, మరీ ఈ షెడ్లు నిర్మించారు. అయితే, నెలలు గడుస్తున్నా ప్రభుత్వం బిల్లులు చెల్లించకడం లేదు. ఇటు అధికారులు కూడా పట్టించుకోవడం లేదు. దీంతో తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగిపోయి, తిరిగి కొత్తగా అప్పుల పాలవుతున్నామని, 'గోకులం' బిల్లులు మాత్రం రావడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

### పవన్ ప్రారంభించినా.. బిల్లు సున్నా



పిఠాపురం మండలం కుమారపురం గ్రామంలో ఈ ఏడాది జనవరి 10వ తేదీన ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కల్యాణ్ అట్టహాసంగా ప్రారంభించిన గోకులం షెడ్డు ఇది. దీని నిర్మాణానికి సంబంధిత రైతు యాతం నాగేశ్వరరావు రూ.1.85 లక్షలు ఖర్చు చేశారు. ఇప్పటి వరకూ ఆయనకు నయాపైసా బిల్లు కూడా చెల్లించలేదు. ఈ సొమ్ము కోసం అప్పటి నుంచీ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా పట్టించుకున్న నాథుడే లేరని నాగేశ్వరరావు వాపోతున్నారు.



కుమారపురంలో గోకులం షెడ్డును ప్రారంభించిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ (ఫైల్)

**గోకులాల నిర్మాణం ఇలా..**

మినీ గోకులం షెడ్ల నిర్మాణంలో పశుసంవర్ధక శాఖతో పాటు నిధుల మంజూరుకు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అధికారులను కూడా ప్రభుత్వం భాగస్వాముల్ని చేసింది. గ్రామీణ ప్రాంతాల్లో ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు, కోళ్ల పెంపకానికి అవసరమైన షెడ్లు నిర్మించడం ఈ పథకం ఉద్దేశం. రెండు ఆవులు లేదా రెండు గేదెలుంటే రూ.1.15 లక్షలు, నాలుగు ఆవులు, గేదెలు ఉంటే రూ.1.66 లక్షలు, ఆరు గేదెలు, ఆవులు ఉంటే రూ.2.30 లక్షల చొప్పున ఈ పథకంలో ప్రభుత్వం అందించాలి. అలాగే, 20 గొర్రెలుంటే రూ.1.30 లక్షలు, 50 గొర్రెలకు రూ.2.30 లక్షలు, 100 కోళ్ల పెంపకానికి రూ.87 వేలు, 200 కోళ్ల పెంపకానికి రూ.1.32 లక్షల చొప్పున ప్రభుత్వం మంజూరు చేసి, ఆ మేరకు షెడ్ల నిర్మాణానికి అనుమతులిచ్చింది. జిల్లాలో ఎంపిక చేసిన మండలాల్లో ఈ పథకానికి అర్హులైన లబ్ధిదారులు అనేక మంది అప్పులు చేసి నిర్మాణాలు పూర్తి చేశారు. ఈ పథకం లబ్ధిదారుల ఎంపికకు గత ఏడాది ఆగస్టులోనే రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అయితే, ఆ సమయంలో కూటమి నేతలు సూచించిన వారినే ఎంపిక చేశారనే ఆరోపణలు వచ్చాయి. ఏదెలా జరిగినా ఎంపికైన రైతులు గోకులం షెడ్ల నిర్మాణానికి ముందుగా తమ వాటాగా 10 శాతం సొమ్మును డీడీల రూపంలో ప్రభుత్వానికి అందజేశారు. నిర్మాణాలను వేగవంతం చేయాలని అధికారులు ఒత్తిడి తేవడంతో అనేక మంది రైతులు అప్పులు చేసి మరీ నిర్మాణాలు పూర్తి చేశారు. తీరా చూస్తే నిర్మాణాలు పూర్తయి నెలలు గడుస్తున్నా ప్రభుత్వం బిల్లులు చెల్లించడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు. దీనిపై గట్టిగా అడిగితే మొత్తం బిల్లు రాకుండా చేస్తారేమోనని భయపడుతున్నారు. దీంతో, ఎవరినీ గట్టిగా అడగలేక, బిల్లులు రాక, అప్పులకు వడ్డీలు కట్టుకోలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పలువురు రైతులు వాపోతున్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రారంభించిన షెడ్డుకే బిల్లు రాకపోతే ఇక తమకు బిల్లులు ఎలా వస్తాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

| జిల్లాలో మినీ గోకులం షెడ్ల వివరాలు | |
|---|---|
| మంజూరైన షెడ్లు | : 1,380 |
| వీటి నిర్మాణానికయ్యే ఖర్చు | : రూ.30 కోట్లు |
| ఇప్పటి వరకూ పూర్తయిన షెడ్లు | : 1,055 |
| బకాయి ఉన్న బిల్లులు | : రూ.11 కోట్లు పైగా.. |

## ఉగ్రవాద దాడి మృతులకు నివాళి

అమలాపురం టౌన్: జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదులు జరిపిన దాడిలో మృతి చెందిన పర్యాటకులకు ఆత్మ శాంతి చేకూరాలని కోరుతూ ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు ఆధ్వర్యాన గురువారం సాయంత్రం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. స్థానిక హైస్కూలు సెంటరులో కొవ్వొతుల వెలుగులతో మృతులకు నివాళులర్పించారు. ర్యాలీలో వైఎస్సార్ సీపీ నాయకులు కుడుపూడి త్రినాథ్, కట్టోజు రాము, వేగిరాజు సాయిరాజు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రవణం వేణుగోపాలరావు, వెటరన్ క్రీడాకారిణి మెహబూబ్ షకీలా తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఏకాదశి పూజలు

అన్నవరం: ఏకాదశి పర్వదినం సందర్భంగా సత్యదేవునికి అర్చకులు గురువారం ఘనంగా పూజలు నిర్వహించారు. ఉదయం 7 నుంచి 7.30 గంటల వరకూ స్వర్ణ పుష్పార్చన, 9 నుంచి 11 గంటల వరకూ తులసి దళార్చన నిర్వహించారు. అనంతరం స్వామివారికి నీరాజన, మంత్రపుష్పాలు, వేదాశీస్సులు అందజేశారు. ప్రధానార్చకుడు ఇంద్రగంటి నరసింహమూర్తి, అర్చకుడు ఇంద్రగంటి వేంకటేశ్వర్లు, పరిచారకులు యడవిల్లి ప్రసాద్, కొండవీటి రాజా తదితరులు ఈ కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారిని సుమారు 40 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. వ్రతాలు రెండు వేలు నిర్వహించారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం సమకూరింది. నిత్యాన్నదాన పథకంలో 6 వేల మంది సత్యదేవుని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

# మధుర ఫలం అధరహో

- రైతుల్లో ఆనందం
- తుని మామిడికి ఎనలేని డిమాండ్
- ప్రారంభమైన ఎగుమతులు
- ఉమ్మడి జిల్లాలో 15,362 హెక్టార్లలో సాగు

**తుని:** వేసవిలో అందరూ మధురఫలం మామిడి రుచి చూసేందుకు వయసుతో నిమిత్తం లేకుండా తహతహ లాడుతుంటారు. పైగా రాష్ట్రంలో ఎక్కడా లేని రుచి తుని మామిడి పండ్లకు ఉంది. ఇక్కడ మూడు తరాలుగా మామిడి పండ్లను ఎగుమతి చేస్తున్నారు. రెండేళ్లుగా విదేశాలకు సైతం ఉద్యానశాఖ ద్వారా ఎగుమతులు చేస్తున్నారు. ప్రస్తుతం ధర బాగుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ ఏడాది ప్రతికూల పరిస్థితులతో మామిడి దిగుబడులు తగ్గడంతో కాస్త వ్యాపారం తగ్గుతుందని రైతులు, వ్యాపారులు చెబుతున్నారు.

**ఇదీ పరిస్థితి..**

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 15,362 హెక్టార్లలో మామిడి తోటలు ఉన్నాయి. తుని సబ్ డివిజన్‌లో 3,458 హెక్టార్లలో మామిడి సాగులో ఉంది. ఇక్కడ పండే బంగినపల్లి, చెరకు రసాలు, తోతాపురి, సువర్ణ రేఖ, పంచదార కంచి, కొత్తపల్లి కొబ్బరి, పందూరి మామిడి పండ్లకు ఎంతో డిమాండ్. గతంలో తుని ప్రాంతం నుంచి 60 వేల టన్నులు ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు జరిగేవి. ప్రస్తుతం ప్రతికూల పరిస్థితుల వల్ల 10,374 టన్నుల దిగుబడి వస్తోందని, తద్వారా ఉద్యానశాఖ లెక్కల ప్రకారం రూ.24 కోట్లు మేర వ్యాపారం జరుగుతుందని అంచనా.

**రైళ్లలో రవాణా**

ట్రాన్స్‌పోర్టు అంతగా అందుబాటులో లేని సమయంలో రైతులు, వ్యాపారులు ఇతర రాష్ట్రాలకు రైళ్ల ద్వారా ఎగుమతులు చేసేవారు. 1947కు ముందు నుంచి మామిడికి తుని ప్రసిద్ధి. అందుకే మ్యాంగో సిటీగా గుర్తింపు పొందింది. క్రమేపీ లారీ ట్రాన్స్‌పోర్టు అందుబాటులోకి రావడంతో ఉత్తరాది రాష్ట్రాలకు భారీ స్థాయిలో ఎగుమతులు చేసి వ్యాపారులు ఆదాయాన్ని పెంచుకున్నారు. ఇక ఉద్యానశాఖ విదేశాలకు ఎగుమతులు చేయడానికి 3,500 మంది రైతులతో ఒప్పందం చేసుకుంది.

**ఇతర రాష్ట్రాలకు ఎగుమతి**

మధుర ఫలాలను ఇతర రాష్ట్రాలకు తుని నుంచి ఎగుమతి చేస్తుంటారు. ఒడిశా, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, గుజరాత్, మధ్యప్రదేశ్, బిహార్, ఢిల్లీ తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తారు. ప్రస్తుతం సువర్ణరేఖ టన్ను రూ.55 వేలు, బంగినపల్లి, రసాలు టన్ను రూ.45 వేలు, తోతాపురి టన్ను రూ.25 వేలు ధర ఉంది. ముందుగా కాపు వచ్చిన పంటకు మంచి ధర లభిస్తుంది. ఇక పందూరు, కొత్తపలి కొబ్బరి రకాల ధర చాలా ఎక్కువగా ఉంది. ప్రజలు ధరను లెక్క చేయకుండా నాణ్యత ఉంటే ఎగబడి కొంటున్నారు.



ఎగుమతి చేసేందుకు సిద్ధం చేసిన మామిడికాయలు



ఫ్రూట్ కవర్ కట్టిన మామిడి పండు



తుని మండలం దొండవాకలో మామిడి చెట్టు కాయలకు కట్టిన ఫ్రూట్ కవర్లు

## నేల స్వభావంతో రుచి



తుని ప్రాంతంలో నేల మామిడికి అనుకూలంగా ఉంది. అందుకే ఇక్కడ పండిన పండ్లకు రుచి మధురంగా ఉంటుంది. సేంద్రియ పద్ధతుల్లో సాగు చేయడం వలన మంచి రంగు ఉంది. పండు నాణ్యత కోసం ఫ్రూట్ కవర్ నిమ్మకాయ సైజులో ఉన్నప్పుడు కట్టాలి. దీంతో నాణ్యత, సైజు, రంగు బాగుంటుంది. చీడ పీడలు వ్యాపించవు. పండు నాణ్యత ఆధారంగా ధర లభిస్తుంది. తుని సబ్ డివిజన్ పరిధిలో 100 హెక్టార్లలో కవర్లు కట్టించాం. ప్రస్తుతం పక్వానికి వచ్చాయి. 10 రోజుల్లో వీటిని దింపి ఎగుమతి చేస్తారు.

– విజయలక్ష్మి, ఉద్యానశాఖ అధికారి, తుని

## ఉలిక్కిపడ్డ పల్లం

**రెండు కుటుంబాల మధ్య దాడిలో ఏడుగురికి గాయాలు**

**కాట్రేనికోన:** మండలం పరిధిలోని అత్యంత సమస్యాత్మక గ్రామం పల్లం.. రెండు కుటుంబాల మధ్య కొట్లాటతో ఉలిక్కి పడింది. స్థానికుల కథనం ప్రకారం మంచినీటి కుళాయి వద్ద బుధవారం మహిళలు మధ్య చోటుచేసుకున్న మాటల యుద్ధం కొట్లాటకు దారి తీసింది. దీనిపై రెండు కుటుంబాలవారు పోలీసు కేసులు పెట్టుకున్నారు. గురువారం ఉదయం మళ్లీ మంచినీటి కుళాయి వద్ద మహిళల మధ్య మాటల యుద్ధం జరిగి, ఒకరిపై ఒకరు కర్రలు, కత్తులతో దాడులు చేసుకునేందుకు దారితీసింది. మల్లాడి చిన వీర్రాజు, మల్లాడి ధర్మారావు వర్గీయులు కత్తులు, కర్రలుతో దాడి చేసుకున్నారు. ఇరు కుటుంబాల కొట్లాటలో స్పృహతప్పి పడిపోయిన తల్లిని చూసిన బాలుడు అందుబాటులో ఉన్న చాకుతో మల్లాడి లక్ష్మణరావును పొడిచాడు. ఇరువర్గాల మధ్య జరిగిన దాడిలో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఇరువర్గాలకు చెందిన మల్లాడి చిన వీర్రాజుకు తలపైన, మల్లాడి లక్ష్మణరావుతో పాటు మిగిలినవారికి గాయాలు అయ్యాయి. గాయపడిన వారిని ముమ్మిడివరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇరు వర్గాల ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కాట్రేనికోన ఎస్సై అవినాష్ పేర్కొన్నారు.

## విద్యుత్ షాక్‌తో కొబ్బరి దింపు కార్మికుడి మృతి



ధనరాజు (ఫైల్)

**చాగల్లు:** మండలంలోని చిక్కాల శివారులో పొలంలో కొబ్బరికాయలు కోస్తూ కరెంట్ షాక్‌తో కార్మికుడు మృతి చెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. చాగల్లు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నిడదవోలు మండలం తాడిమళ్ల గ్రామానికి చెందిన కోలా ధనరాజు(22) చిక్కాల గ్రామ శివారులో ఉన్న కొబ్బరి తోటలో కొబ్బరికాయలు దించడానికి కూలీలతో కలిసి గురువారం వెళ్లాడు. కొబ్బరికాయలు దించుతుండగా అతను నరికిన కొబ్బరి ఆకు ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న విద్యుత్ వైర్లపై పడటంతో ధనరాజు విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. సహచర కూలీలు నిడదవోలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా వైద్యులు అప్పటికే చనిపోయినట్లు నిర్ధారించారు. మృతుని అన్నయ్య అయిన కోలా శివ ఫిర్యాదు మేరకు చాగల్లు ఎస్ఐ కె.నరేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. చేతికి అంది వచ్చిన కొడుకును మృత్యువు కబళించడంతో మృతుడి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు.

## గృహ ప్రవేశానికి బయల్దేరి..

**కొవ్వూరు:** తన సోదరి గృహ ప్రవేశం కార్యక్రమానికి బయల్దేరిన సీరపు ప్రసాద్‌రెడ్డి (55) గురువారం కొవ్వూరు ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సు కోసం వేచి ఉన్న సమయంలో ఆకస్మికంగా బెంచి మీద నుంచి పడి మృతి చెందారు. 108 అంబులెన్స్ సిబ్బంది పరీక్షించి ఆయన మృతి చెందినట్లు ధ్రువీకరించారు. గుండెపోటు వచ్చి మృతి చెంది ఉండవచ్చునని భావిస్తున్నారు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకుని కుటుంబ సభ్యులు అతని మృత దేహాన్ని ఇంటికి తీసుకెళ్లారు. మృతుడు పట్టణంలో అచ్చాయమ్మ కాలనీవాసుడిగా గుర్తించారు. కొవ్వూరు నుంచి గృహప్రవేశం నిమిత్తం విజయవాడ వెళ్లేందుకు బయల్దేరి బస్ డిపోలోనే మృతి చెందడంతో కుటుంబ సభ్యులు తీవ్ర దిగ్భ్రాంతి చెందారు.

## క్లుప్తంగా

### తాటాకిల్లు దగ్ధం

**రూ.ఐదు లక్షల ఆస్తి నష్టం**



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

**ముమ్మిడివరం:** మండలంలోని ఠానేల్లంక పంచాయతీ బలుసుల్లంకలో గురువారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల తాటాకిల్లు దగ్ధమై సుమారు రూ.5లక్షల వరకు ఆస్తి నష్టం సంభవించింది. గ్రామానికి చెందిన చిన్నం ప్రసాద్‌కు చెందిన తాటాకిల్లు అగ్నికి ఆహుతైంది. వ్యవసాయ కూలీలైన భార్యాభర్తలు పనికోసం బయటకు వెళ్లగా కూమారులు ఇద్దరు తాపీ పనికి వెళ్లారు. ఈ సమయంలో ఇంటి వద్ద ఎవరూ లేకపోవడంతో తాటాకిల్లు పూర్తిగా దగ్ధమై కట్టుబట్టలతో మిగిలారు. విలువైన ఫర్నిచర్, వంట సామగ్రి, పత్రాలు కాలి బూడిదయ్యాయి. స్థానికుల సహాయంతో ముమ్మిడివరం అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు.

### రైలు నుంచి జారిపడి మహిళ మృతి



**తుని:** రైలు నుంచి జారి పడి గుర్తు తెలియని మహిళ మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ ఎస్సై గురువారం తెలిపారు. వివరాల్లోకెళితే.. యలమంచిలి, నరశింగపల్లి రైల్వే స్టేషన్ల మధ్య సుమారు 35 సంవత్సరాల వయస్సు కలిగిన మహిళ రైలు నుంచి జారిపడి అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలు ఆకుపచ్చరంగు చీర, గోల్డ్ కలర్ జాకెట్ వేసుకుని ఉంది. మృతురాలి దగ్గర ఎటువంటి ఆధారాలు లభించలేదు. శవాన్ని తుని ఏరియా ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచారు. వివరాలకు 94906 19020 నంబరులో సంప్రదించవచ్చన్నారు.

### జీతాలు ఎప్పుడిస్తారు స్వామీ?

**అన్నవరం:** వీర వేంకట సత్యనారాయణ స్వామివారి ఆలయంలో విధులు నిర్వహిస్తున్న 349 మంది పారిశుధ్య సిబ్బందికి మార్చి నెల వేతనాలు చెల్లించకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. ఆలయానికి పారిశుధ్య సిబ్బందిని సరఫరా చేస్తున్న గుంటూరుకు చెందిన కనక దుర్గా ఏజెన్సీ పీఎఫ్ మొత్తాన్ని ముందుగా బ్యాంకులో జమ చేయాల్సి రావడం, ఆ తరువాత ఆడిట్ ఇబ్బందుల వలన జీతాల చెల్లింపు ఆలస్యమైందని ఒకటి రెండ్రోజుల్లో జీతాలు చెల్లిస్తారని అధికారులు అంటున్నారు.



# పుణ్యస్నానానికి వెళ్లి తిరిగిరాని లోకాలకు..

- ఏలేరు కాలువలో పడి అమ్మమ్మ, మనవడి మృతి
- ఆ కుటుంబంలో విషాద ఛాయలు

**ఏలేశ్వరం:** ఏలేరు కాలువలో పుణ్యస్నానం చేసేందుకు దిగి అమ్మమ్మ, మనవడు మృతిచెందిన ఘటన మండలంలోని యర్రవరంలో జరిగింది. దీంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పోలీసుల వివరాల ప్రకారం ప్రత్తిపాడుకు చెందిన అరట్లకోట సత్యవతి(52) ఏగులమ్మ గుడి వద్ద పనులు చేస్తుంటుంది. అమ్మవారి జాతర ఉండడంతో పుణ్యస్నానం చేసేందుకు కూతురు కుమారుడైన గోర్స వీరమనోజ్(12)తో కలిసి బుధవారం సాయంత్రం యర్రవరంలోని ఏలేరుకాలువలో స్నానం చేసేందుకు దిగింది. ప్రమాదవశాత్తు కాలువలో ఉన్న గోతుల్లో మునిగిపోవడంతో ఇద్దరూ మృత్యువాత పడ్డారు. కాలువలో పుణ్యస్నానం నిమిత్తం వచ్చి మృత్యువాత పడడంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. ఎస్సై రామలింగేశ్వరరావు మృతదేహాలను పోస్టుమార్టం కోసం ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**ప్రత్తిపాడులో విషాద ఛాయలు**

**ప్రత్తిపాడు:** యర్రవరం వద్ద ఏలేరు కాలువలో పడి అమ్మమ్మ, మనుమడు మృతి చెందడంతో ప్రత్తిపాడులో విషాద ఛాయలు అలముకున్నాయి. వీరి మరణం రెండు కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. గురువారం ఏలేశ్వరం పోలీసులు శవ పరీక్షకు ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు మృతదేహాలను తరలించారు. సమాచారం అందుకున్ని మృతుల బంధువులు సీహెచ్‌సీకి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. ప్రత్తిపాడు సెంటర్‌లో ఉండే శ్రీఏగులమ్మ అమ్మవారి ఆలయంలో సేవ చేసుకుంటున్న విశ్వబ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన అరట్లకట్ల సత్యవతి మృతి స్థానికులను కలచివేసింది. ఆమె ఆలయం, పరిసరాలను శుభ్రం చేసుకుంటూ కాలం గడిపేది. గురువారం శ్రీఏగులమ్మ వారి ఆలయంలో పందిరి రాట వేసే కార్యక్రమంలో పాల్గొనే ఉద్దేశంతో నదీ స్నానం చేస్తే మంచిదని భావించిన సత్యవతి తన మనుమడు వీర మనోజ్‌ను వెంటబెట్టుకుని, ఏలేరు నదీ స్నానమాచరించేందుకు బుధవారం సాయంత్రం యర్రవరం వెళ్లింది. ఆమె ఎంతకీ తిరిగి రాకపోవడంతో ఆమె భర్త నాగేశ్వరరావు బంధువుల ఇంట గాలించాడు. గురువారం ఉదయం ఏలేరులో శవమై తేలడంతో నిశ్చేష్టుడయ్యాడు. ఇల్లాలు శవమై రావడంతో కన్నీరుమున్నీరుగా విలపించాడు. భర్త కమ్మరం పని చేసి, తెచ్చే సంపాదనతోనే కుటుంబం నడుస్తోంది. ఆమెకు ముగ్గురు కుమార్తెల సంతానం. వారందరికీ వివాహాలు చేసింది. ఆమె మరణం ఆలయ పరిసర ప్రజలను కలచివేసింది. కాగా సత్యవతి కుమార్తె గోర్స రమణమ్మ, రాజు దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం. వడ్రంగి పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకునే రాజు పెద్ద కుమారుడు వీర మనోజ్ (12) స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. అమ్మమ్మకు సాయంగా వెళ్లి మృత్యువాత పడ్డాడు. చేతికి అందివస్తాడనుకొన్న కొడుకు తమను వదిలిపోవడంతో ఆ దంపతుల శోకానికి అంతులేకపోయింది. తమకు తల కొరివి పెడతాడనుకొన్న కొడుకుకు తామే కొరివి పెట్టాల్సి వస్తుందని బోరున విలపించారు.



ఏలేరు కాలువ వద్ద మృతదేహాలు





అరట్లకట్ల సత్యవతి, గోర్స వీర మనోజ్ (పాతచిత్రాలు)

## నేడు గురుకుల ప్రవేశ పరీక్షలు



సమావేశంలో డీఆర్ఓ రాజకుమారి

**అమలాపురం రూరల్:** ఏపీ గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు శుక్రవారం ప్రవేశ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ పరీక్షల నిర్వహణపై కాకినాడ జిల్లా తుని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ హేమలత, పరీక్ష కేంద్రాల ముఖ్య పర్యవేక్షకులు, అధికారులతో జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ) రాజకుమారి కలెక్టరేట్‌లో గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్, వెత్సవారి అగ్రహారంలోని మహాత్మా గాంధీ మున్సిపల్ హైస్కూల్ కేంద్రాల్లో గురుకుల ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గురుకుల పాఠశాలల్లో 5 నుంచి 8వ తరగతి వరకూ ప్రవేశాలకు బ్యాక్‌లాగ్‌కు సంబంధించి 40 మంది ఈ పరీక్షకు హాజరు కానున్నారన్నారు. గురుకుల జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలల ప్రవేశ పరీక్షకు 285 మంది హాజరు కానున్నారని తెలిపారు. 5, 6, 7, 8 తరగతుల ప్రవేశ పరీక్ష ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, జూనియర్, డిగ్రీ కాలేజీల ప్రవేశ పరీక్ష మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ జరుగుతుందని వివరించారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా అభ్యర్థులను అనుమతించాలని రాజకుమారి స్పష్టం చేశారు. సమావేశంలో ప్రవేశ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ బి.హనుమంత రావు, చీఫ్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

# నిరుపయోగంగా నివేదన శాల

- రెండు నెలలైనా అమలు కాని ఈఓ నిర్ణయం
- దాత అసంతృప్తి

**అన్నవరం:** స్థానిక వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో తుని పట్టణానికి చెందిన దాత చెక్కా సూర్యనారాయణ (తాతబాబు) రూ.30 లక్షలతో నిర్మించిన నివేదన శాల పునః ప్రారంభిస్తామని అధికారులు ప్రకటించి రెండు నెలలైనా అమలు కాలేదు. దీంతో అధికారుల తీరుపై దాత అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దేవస్థానంలో స్వామివారి నివేదన శాల నిర్మించాలని తాతబాబును 2023 జూన్‌లో అప్పటి ఈఓ ఎస్ఎస్ చంద్రశేఖర్ అజాద్ కోరారు. ఆయన రూ.30 లక్షల వ్యయంతో సర్క్యులర్ మండపంపై నివేదనశాల నిర్మించారు. ఈ నిర్మాణానికి దేవస్థానం పండితులు కూడా ఆమోదం తెలిపారు. దీనిని 2023 ఆగస్టులో దాత చేతుల మీదుగా ప్రారంభించారు. ఆ తరువాత సత్యదేవుని నివేదనలన్నీ ఈ షెడ్డులోనే తయారు చేసి నివేదించేవారు. 2023 నవంబర్‌లో ఈఓ చంద్రశేఖర్ అజాద్ బదిలీ కాగా ఆయన స్థానంలో ప్రస్తుతం దేవదాయశాఖ ఇన్‌చార్జి కమిషనర్‌గా వ్యవహరిస్తున్న కె.రామచంద్రమోహన్ ఈఓగా బాధ్యతలు స్వీకరించారు. నివేదన శాల భూస్పర్శతో భూమి మీదనే ఉండాలని పండితులు సూచించడంతో పాత నివేదనశాల లోనే మళ్లీ నివేదనలు తయారు చేయాలని ఆయన ఆదేశించారు. దీంతో 2023 నవంబర్ నుంచి పాత నివేదనశాలను ఉపయోగిస్తున్నారు.



దాత నిర్మించిన నివేదన శాల



దాత తాతబాబు

**'సాక్షి' కథనంతో ఈఓ ప్రకటన**

ఫిబ్రవరి 21న 'సాక్షి' దినపత్రికలో నిరుపయోగంగా ఉన్న నివేదనశాలపై 'దాతల ఆశయాలకు తూట్లు ' శీర్షికన వార్త ప్రచురితమవడంతో ఈఓ వీర్ల సుబ్బారావు స్పందిస్తూ దాత చెక్కా తాతబాబు నిర్మించిన నివేదన షెడ్డు ను కూడా వినియోగంలోకి తేవాలని నిర్ణయించామని, పులిహోర, ఇతర ప్రసాదాలు తయారు చేయించి భక్తులకు పంపిణీ చేయిస్తామని చెప్పారు. ఇవి తయారు చేయడానికి ఒక కుక్, మరో సహాయకుడు అవసరం. వారిని నియమించడానికి ఎంఎల్‌సీ ఎన్నికల కోడ్ అడ్డుగా ఉందని తెలిపారు. ఇది జరిగి రెండు నెలలు దాటినా ఆచరణకు నోచుకోకపోవడంపై దాత సూర్యనారాయణ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మే ఏడో తేదీ నుంచి సత్యదేవుని కల్యాణ మహోత్సవాలు జరుగనున్నాయి. కనీసం ఆ ఉత్సవాల నాటికైనా ఈ నివేదనశాలను వినియోగంలోకి తేవాలని దాత కోరుతున్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

**ప్రత్తిపాడు రూరల్:** మండలంలోని బవురువాక గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్త అచ్చంపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గురువారం యువకుడు మృతి చెందాడు. శంఖవరం మండలం వేళంగి పంచాయతీ దారా మల్లాపురం గ్రామానికి చెందిన ఆవూరి లోవరాజు(22) షాపింగ్ కోసం బైక్‌పై రౌతులపూడి వెళ్లాడు. షాపింగ్ ముగించుకుని తిరిగి ఇంటికి వస్తుండగా కొత్త అచ్చంపేట సమీపంలో బైక్ అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో లోవరాజు ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మృతదేహాన్ని ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. ప్రత్తిపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## అప్పు రాబట్టుకునేందుకు బాలుడి కిడ్నాప్

**చాకచక్యంగా పట్టుకున్న కోరంగి పోలీసులు**



బాలుడిని కిడ్నాప్ చేసిన వ్యక్తిని చొల్లంగిపేటలో అరెస్ట్ చేసిన కోరంగి పోలీసులు

**తాళ్లరేవు:** అప్పుగా తీసుకున్న డబ్బు తిరిగి రాబట్టేందుకు బాలుడిని కిడ్నాప్ చేసి అడ్డంగా బుక్కయిన వ్యక్తి ఉదంతమిది. కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని జి.వేమవరం గ్రామానికి చెందిన అయినవిల్లి కాళీకృష్ణ భగవాన్ రెండవ కుమారుడు ఫణివర్ధన్ రెండు రోజుల క్రితం అదృశ్యమయ్యాడు. తండ్రి ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాకినాడ ఏఎస్పీ పాటిల్ దేవరాజ్ మనీష్ పర్యవేక్షణలో కాకినాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణ, కోరంగి ఎస్సై పి.సత్యన్నారాయ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. ఈ విచారణలో బాలుడు అదృశ్యం కాలేదని, కిడ్నాప్‌కు గురైనట్లుగా గుర్తించారు. బాలుడు తండ్రి కాళీకృష్ణ భగవాన్ మూడేళ్ల క్రితం చొల్లంగిపేట గ్రామానికి చెందిన కుంది అద్దాలు వద్ద రూ.1.20 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. ఎన్నిసార్లు అడిగినా ఇవ్వకపోవడంతో ఆ డబ్బులు రాబట్టుకునేందుకు కాళీకృష్ణ భగవాన్ రెండవ కుమారుడైన ఫణివర్ధన్‌ను కిడ్నాప్ చేసి ఉప్పాడ కొత్తపల్లి ప్రాంతంలో రెండు రోజులపాటు దాచాడు. అక్కడి నుంచి బాలుడు ఫణివర్ధన్‌ను చొల్లంగిపేటలోని తన స్వగృహానికి గురువారం తీసుకువచ్చాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు చాకచక్యంగా దాడిచేసి అతని బారినుంచి బాలుడిని కాపాడి తల్లిదండ్రులకు అప్పగించారు. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టుకు తరలించగా రిమాండ్ విధించినట్టు ఎస్సై తెలిపారు.

## వైద్య ధ్రువపత్రాల పరిశీలన



ఉపాధ్యాయుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న డాక్టర్ విఠల్

**కాకినాడ క్రైం:** త్వరలో ఉపాధ్యాయుల బదిలీలు జరగనున్న నేపథ్యంలో తమ వైద్య ధ్రువపత్రాల పరిశీలన కోసం బారులు తీరారు. గురువారం కాకినాడ జీజీహెచ్‌లో ఇందుకు ఏర్పాట్లు చేశారు. ఉమ్మడి గోదావరి జిల్లాలకు చెందిన 192 మంది ఉపాధ్యాయులు వైద్య ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎంపిఆర్ విఠల్ ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసన్, డిప్యూటీ కలెక్టర్, అడ్మినిస్ట్రేటర్ శ్రీధర్, ఏఆర్ఎంవో డాక్టర్ లావణ్య పర్యవేక్షకులుగా వ్యవహరించారు. మరో రెండు రోజుల పాటు పరిశీలన కొనసాగనున్న నేపథ్యంలో సహాయం కోసం 97057 85454, 98490 31316 నంబర్లను సంప్రదించాలన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

**కొవ్వూరు:** సీతంపేట గ్రామంలో గట్టు సత్తెమ్మ తల్లి గుడి వెనుక గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గురువారం సాయంత్రం స్థానికులు గమనించారు. మృతుడి వయసు సుమారు 55 ఏళ్లు ఉండవచ్చునని భావిస్తున్నారు. అనారోగ్యంతో చనిపోయి ఉండవచ్చునని రూరల్ ఎస్సై కె.శ్రీహరిరావు తెలిపారు. మృతుడు చూడడానికి యాచకుడిగా కనిపిస్తున్నాడు. మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. వివరాల కోసం 94407 96623 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.